రైతులకు యంత్ర సాయం

- ఆర్బీకేల ద్వారా అర్హుల గుర్తింపు
- ఏలూరులో రూ.35 లక్షల రాయితీ

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు, రోటో వేటర్లు, పవర టిల్లర్లు, డిస్కలు, పిచికారీ యంత్రాలు కొనుగోలు చేసేందుకు ఆర్థిక సాయం అందిస్తోంది. గ్రామాల్లో రైతులు జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడి 10 శాతం నగదు చెల్లిస్తే, మరో 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 50 శాతం బ్యాంకులు రుణ సాయం అందిస్తుంది. ఇందుకు రైతులకు ప్రభుత్వమే బ్యాంక్ షూరిటీ ఇవ్వడం మరో విశేషం. ప్రభుత్వం కృషి ఫలితంగా నేడు వరి, మొక్కజొన్న, అరుతడి పంటలు సాగు చేసే రైతులకు యంత్రాలు తోడయ్యాయి.


చొదిమెళ్ల రైతులకు ట్రాక్టర్ అందించిన అధికారులు (ఫైల్)


వెంకటాపురంలో రైతులకు యంత్రాలను అందిస్తున్న అధికారులు (ఫైల్)

యంత్రాల కొనుగోలుకు సబ్సిడీ

ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ శాఖ అధికారులు ఏలూరు మండల గ్రామాల్లో రైతులు యంత్రాలు కొనుగోలు చేసేందుకు రూ.35 లక్షల సబ్సిడీ అందించారు. 2021 – 22 సంవత్సర కాలంలో ఎనిమిది ఆర్బీకేల ద్వారా రూ.25.67 లక్షల సబ్సిడీతో యంత్రాలు అందజేశారు. 2022 –23లో నాలుగు ఆర్బీకేల ద్వారా రూ.9.25 లక్షల సబ్సిడీ గల రెండు ట్రాక్టర్లు అందించారు. మొత్తంగా సుమారు 60 మంది రైతులతో కూడిన 12 గ్రూపులకు ప్రభుత్వం పలు రకాల యంత్రాలు అందించి రూ.35 లక్షలు సబ్సిడీ ఇచ్చింది.

ప్రభుత్వం కృషి బాగుంది



వ్యవసాయాన్ని అభివృద్ధి బాటపట్టించేందుకు ప్రభుత్వం జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. ఖరీదైన యంత్రాలు కొనుగోలు చేయాలంటే చిన్న, సన్నకారు రైతు ఆర్థిక స్తోమత సరిపోదు. ఐదుగురు కలిసి గ్రూప్‌గా ఏర్పడి ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవచ్చు. రైతులు అందరూ గ్రూపులుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి మరిన్ని సదుపాయాలు పొందవచ్చు. ఇది వ్యవసాయానికి మేలు చేస్తుంది.

– బెజవాడ వెంకన్న, రైతు, చొదిమెళ్ల

యంత్రాలతో మేలు



ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు చేకూరింది. గతంలో ఎకరం పొలం దుక్కి దున్నాలంటే ఎంతో శ్రమించాల్సి వచ్చేంది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం ట్రాక్టర్లు ఇవ్వడం వల్ల రైతు కేవలం ఆరు గంటల్లో ఎకరం పొలం దున్నేయవచ్చు. ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుంది. గతంలో యంత్రాలు కొనుగోలు చేయలేక రైతులు అవస్థలు పడ్డారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటోంది.

– రావూరి రామకృష్ణ, చొదిమెళ్ల

40 శాతం సబ్సిడీ శుభ పరిణామం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసి చూపిస్తున్నారు. రైతులు యంత్రాలు కొనుగోలు చేసేందుకు 40 శాతం సబ్సిడీ అందించడం బాగుంది. గ్రూప్ సభ్యులు 10 శాతం అంటే ఒక్కొక్క సభ్యుడు ట్రాక్టర్ ఖరీదును బట్టి కనీసం రూ.8 వేల నుంచి రూ.10 వేలు జమ చేస్తే చాలు ట్రాక్టర్ కొనుగోలు చేయవచ్చు. యంత్రాలు ఉపయోగించడం వల్ల రైతుతో పాటు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తుంది.

– బండి రాంబాబు, చొదిమెళ్ల

తక్కువ అద్దెకు యంత్రాలు



జేఎల్‌జీ గ్రూపులకు ప్రభుత్వం ట్రాక్టర్ అందించడం వల్ల ఇతర రైతులకూ మేలు చేకూరుతుంది. ట్రాక్టర్ లేని రైతు జేఎల్‌జీ గ్రూపు నుంచి తక్కువ అద్దెకు ట్రాక్టర్ తీసుకోవచ్చు. దీనివల్ల రైతుకు తక్కువ అద్దెకు ట్రాక్టర్ వస్తుంది. ఇదే సమయంలో జేఎల్‌జీ గ్రూపులకు సైతం ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయంతో బ్యాంక్‌కు నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్ తేలికగా చెల్లించవచ్చు.

– యక్కల త్రిమూర్తులు, చొదిమెళ్ల

మా గ్రూప్‌కు రూ.3.40 లక్షల సబ్సిడీ వచ్చింది



మేం జేఎల్‌జీ గ్రూప్ ద్వారా జాన్‌డీర్ ట్రాక్టర్ కొన్నాం. దీని ఖరీదు రూ.8,82,978. రైతులంతా కేవలం 10 శాతం మొత్తం అంటే రూ.74,392 మాత్రమే చెల్లించాం. మిగిలిన మొత్తంలో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అంటే రూ.3.40 లక్షలు అందించింది. మిగిలిన 50 శాతం రూ.4,41,489 ప్రభుత్వ హామీతో బ్యాంక్ లోను ఇచ్చింది.

– రావూరి వెంకటేశ్వరరావు, రైతు, చొదిమెళ్ల

క్లుప్తంగా

హుండీల ఆదాయం రూ.1.89 లక్షలు


రామలింగేశ్వర స్వామి హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, ఆలయ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పత్తేబాదలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం రూ.1,89,840 లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు తెలిపారు. ఈ ఆదాయం 156 రోజులకు భక్తులు సమర్పించుకున్నారని చెప్పారు. గురువారం నిర్వహించిన హుండీల ఆదాయం లెక్కింపును దేవదాయశాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నరసింహారావు పర్యవేక్షించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బళ్ల రవి కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్‌ఓ రాష్ట్ర సర్వసభ్య సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్‌ఓ) రాష్ట్ర సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం స్థానిక అల్లూరి సత్యనారాయణ భవనం (సీఐటీయూ కార్యాలయం)లో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, అధ్యక్షుడు ఎస్ భాస్కర్ పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు విద్యార్థి ప్రదర్శన, వైద్య విద్యలో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో సీట్ల అమ్మకానికి నిర్ణయించడంపై ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగిస్తాం

దెందులూరు: స్థానిక గౌడవీధిలోని బూత్ పరిధిలో 42 మంది ఓటర్లు చనిపోవడంతో వారి ఓట్లు తొలగిస్తామని దెందులూరు బూత్ లెవల్ ఆఫీసర్ పీ.శివకుమార్ అన్నారు. ముందుగా కుటుంబ సభ్యులు, బంధువుల ద్వారా నిర్ధారించి మండల ఎన్నికల అధికారికి నివేదిక అందజేశామని ఆయన అన్నారు. గురువారం ఓట్ల పరిశీలనలో భాగంగా గౌడవీధిలో కొత్తపల్లి జ్యోతి నివాసంలో అర్హులైన ఇద్దరికి ఓటు హక్కు దరఖాస్తులు పూర్తి చేశారు. ఈ నెల 21వ తేదీ వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్ల పరిశీలన నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది వచ్చినప్పుడు ప్రతిఇంట్లో కుటుంబసభ్యులు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు డెస్కుల వితరణ


విష్ణువర్ధనరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం నగరానికి చెందిన విశ్రాంత ఇంజినీర్ చందన విష్ణువర్ధనరావు 30 డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధనరావు మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా అత్యుత్తమ విద్య ద్వారా ఉన్నత స్థానాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ డెస్కులు కావాలని విష్ణువర్ధనరావును అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి రూ.2.7 లక్షల విలువైన డెస్కులు అందించడం ఆయన ఔదార్యానికి నిదర్శనమన్నారు. దాతల ఆశయాల మేరకు విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాత విష్ణువర్ధనరావును దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వి.వెంకటరావు, ఎం కృష్ణ చైతన్య, టీవీ దుర్గాప్రసాద్, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఇ.రఘుబాబు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 164 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలు, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. సెమిస్టర్ పరీక్షలకు 148 మంది విద్యార్థులకు 145 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు 70 మందికి 19 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

వ్యాయామ విద్యార్థులకు అభినందన


ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నత్తానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతర సాధన చేసి కలెక్టర్ చేతులమీదుగా అవార్డు పొందడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నత్తానియేల్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థుల ప్రదర్శనకు మొదటి స్థానం రావడం, కలెక్టర్ రూ. 15 వేలు నగదు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేయడం గర్వకారణమన్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామల, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, విజయలక్ష్మి, విద్యార్థులను అభినందించారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

ఎంపీపీ శ్రీనివాసరాజు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కడతారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం నిర్వహించిన ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నాలుగేళ్ల కాలంలో 15 గ్రామాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయడం మరువలేమన్నారు. అభివృద్ధిలో ఏలూరు మండల గ్రామాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు.

- రెండేళ్ల క్రితం సీఎం జగన్ రూ.40 వేల విలువైన ఇంజక్షన్లు ఉచితంగా అందించి లక్షలాది నిరుపేద హృద్రోగుల ప్రాణాలు కాపాడారని మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు కొనియాడారు.
- ఏపీఎం ప్రభావతి మాట్లాడుతూ మండలంలో 842 డ్వాక్రా సంఘాల్లో సభ్యులు 8,432 మందికి ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం మూడు విడతల్లో మొత్తం రూ.17 కోట్లు అందించిందన్నారు. ఈ ఏడాది సున్నా వడ్డీ కింద రూ.90.22 లక్షలు సంఘాల ఖాతాల్లో జమైందని చెప్పారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తమ పొదుపు అకౌంట్ డబ్బు వాడుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు.
- లింగారావుగూడెం, శ్రీపర్రు, మానూరు, పైడిచింతపాడు, చాటపర్రు, తిమ్మారావుగూడెం, జాలిపూడి ఎస్సీకాలనీ, గురుకులపేట జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి రూ.4.65 కోట్లు ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపామని హౌసింగ్ ఏఈ కె.లక్ష్మణ్ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. మాదేపల్లి, చాటపర్రు, జాలిపూడి, మల్కాపురంలో జగనన్న కాలనీల అప్రోచ్‌రోడ్డు కోసం రూ.56.90 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.
- ప్రత్తికోళ్లలంక, మొండికోడు, మాదేపల్లి, లింగారావుగూడెం జగనన్న కాలనీల్లో లెవిలింగ్ పూర్తివడంతో నాలుగు రోజుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభిస్తామని డీ–5 ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. జాలిపూడి తాగునీటి చెరువులకు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పంచాయతీ అధికారులు దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు.
- మండలంలో 168 మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని తహసీల్దార్ బి.సోమశేఖర్ తెలిపారు. జాలిపూడి గ్రామస్తులు ఓట్లు చాటపర్రు పోలింగ్ బూత్‌కు మారిపోయాని ఎంపీటీసీ తంబి చెప్పడంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 17న ముసాయిదా, జనవరి 5న తుది జాబితా పబ్లికేషన్ ఉంటుందని చెప్పారు.


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, పార్టీ నాయకులు తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, చాటపర్రు సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా నగదు తరలింపు

పెదపాడు: ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 67,40,210ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రి నుంచి చెన్నైకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఓ ప్రయాణికుడి వద్ద నగదు ఉన్నట్టు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అతని నుంచి ఆ నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	54	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	50-80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	50-60	బీట్‌రూట్	36
కాకర కాయలు	46	కీరా దోస	36
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30 - 34	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-30	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	21

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

పెదపాడు: మండలంలోని ఉప ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్‌స్టేషన్లను పెదపాడు ఎంపీడీఓ ఎస్ నిర్మలజ్యోతి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పరిశీలించారు. గురువారం పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను వారు పరిశీలించి అక్కడ ఏర్పాట్లు పర్యవేక్షించారు. విద్యుత్, తాగునీరు, పోలింగ్ అధికారులకు వసతి ఏర్పాటు చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని పోలింగ్ నిర్వహించనున్న గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అమలులో ఉంటుందన్నారు. ఆయన వెంట స్థానిక వీఆర్వోలు ఉన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

పెదవేగి : కారు చీకటిలో ఇబ్బందులు పడుతున్న జగనన్న కాలనీ వాసుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో అధికారులు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. పెదవేగి మండలం రామసింగవరం, వేగివాడలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని గృహ లబ్ధిదారులు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని కలిసి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామసింగవరం, వేగివాడ జగనన్న కాలనీల్లో విద్యుత్ శాఖ సిబ్బంది వీధి దీపాలను గురువారం ఏర్పాటు చేయించారు. అడిగిన వెంటనే తమ సమస్యను పరిష్కరించినందుకు, రెండు గ్రామాల జగనన్న కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి కతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


ఎమ్మెల్యే చొరవతో రామశింగవరం, వేగివాడ జగనన్న కాలనీల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు

రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


వంగాయగూడెం- పెరికీడు రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: మండలంలో చేపడుతున్న ఆర్అండ్‌బీ రహదారి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ డీ జాన్‌మోషేతో కలిసి గురువారం రూ.50కోట్ల ఎన్‌డీబీ నిధులతో చేపడుతున్న వంగాయగూడెం-పెరికీడు రహదారి పనులను ఆయన పరిశీలించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గండిచెరువు గట్టు వరకు 500మీటర్ల సీసీ రహదారిని కాలినడకన వెళ్లి ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. సీసీ రోడ్డు నిర్మా ణం పూర్తయిన తర్వాత డ్రెయినేజీల నిర్మాణం చేపడతామని చెప్పారు. అనంతరం తోటగూడెంలో రహదారిని ఆయన పరిశీలించారు. అనంతరం వసంతవాడలో గ్రామస్తులతో మాట్లాడారు. రహదారి అధ్వానంగా ఉండటంతో పెరికీడు, పెదపాడు వెళ్లలేని స్థితిలో రహదారులు ఉన్నాయని వాటిని వీలైనంత త్వరగా అభివృద్ధిచేయాలని గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ కోరారు. వెంటనే రహదారులు భవనాలు శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని వారికి సూచించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ ఈఈ వైవీ కిశోర్‌బాబు, ఏఈ శేషుబాబు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, కడిమి గోవిందరావు, పెద పా డు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి వివిధ గ్రామా ల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో సమస్యలు పరిష్కారం

పెదవేగి : ప్రజా దర్బార్ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.